క్లుప్తంగా

ఏప్రిల్ 4న చాగంటి కోటేశ్వరరావు రాక

నంద్యాల(వ్యవసాయం): ఆధ్యాత్మిక వేత్త, ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు ఏప్రిల్ 4న నంద్యాలకు రానున్నట్లు మన ఊరు–మన గుడి, మన బాధ్యత నిర్వాహకులు శివకుమార్ రెడ్డి, రాంప్రసాద్ తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ ఆధ్యాత్మిక సందేశం ఇవ్వడానికి రానున్నారని, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

రెవెన్యూ ఉద్యోగి మృతి

శిరివెళ్ల: మండల కేంద్రానికి చెందిన రెవెన్యూ ఉద్యోగి ధర్మయ్య (55)అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. తహసీల్దార్ షేక్ మొయిద్దీన్, ఆర్ఐ సుచరిత, వీఆర్ఓ చెన్నయ్య తదితరులు ధర్మయ్య మృతదేహంపై పుష్ప గుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అంత్యక్రియలకు రూ.15 వేలను మృతుని కుటుంబానికి అందజేశారు.

18న రాష్ట్ర స్థాయి వాలీబాల్ టోర్నీ

బనగానపల్లెరూరల్: కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కాటసాని ఓబులరెడ్డి ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ నుంచి రాష్ట్ర స్థాయి ఓపెన్ వాలీబాల్ టోర్నమెంట్ పోటీలు నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ నిర్వాహకులు సోమవారం తెలిపారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడామైదనంలో జరిగే పోటీల్లో విజేతలకు వరుసగా రూ.30వేలు, రూ.20వేలు, రూ.10వేలు నగదు బహుమతులను అందజేస్తామన్నారు. ఆసక్తిగలవారు ఈ నెల 16వ తేదీ లోపు 9885569450 నంబరుకు సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

దేవస్థానం ఉద్యోగులు ఔదార్యం



బాధితురాలికి డీడీ అందజేస్తున్న ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానంలో అన్నదాన విభాగంలో ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న శ్రీరామాంజినేయులు అనారోగ్యంతో ఇటీవల మృతిచెందాడు. వారికుటుంబానికి ఆర్థిక సహాయంగా దేవస్థానం ఉద్యోగులు విరాళాన్ని అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. సోమవారం దేవస్థానం ఈఓ ఛాంబర్ లో మృతుని భార్య లావణ్యకు ఈఓ ఎస్ లవన్న చేతుల మీదుగా దేవస్థానంలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బంది వారి ఒక రోజు వేతనం మొత్తం రూ.2,73,128లు డీడీ రూపంలో అందజేశారు.

పశుగ్రాసం దగ్ధం



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

పాములపాడు: మండలంలోని మద్దూరు గ్రామ పంచాయతీ మజరా కృష్ణానగర్‌లో పశుగ్రాసం దగ్ధమైన ఘటన సోమవారం చోటుచేసుకుంది. బాధిత రైతు షేక్ ఇస్మాయిల్ తెలిపిన వివరాల మేరకు 5 ఎకరాల జొన్న చొప్ప, 4 ఎకరాల వరి గడ్డితో ఇటీవల వామిగా (గడ్డిని కుప్పగా నిర్మించడం) ఏర్పాటు చేసుకున్నాడు. సోమవారం ఇంటి వద్ద ఎవరూ లేని సమయంలో అగ్నిప్రమాదం జరిగింది. ఇందులో పశు గ్రాసంతో పాటు ఎద్ల బండి టైరు చక్రం కాలిపోగా, ఆవుకు స్వల్పగా గాయాలయ్యాయి. ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.75వేల మేర ఆస్తి నష్టం సంభవించిందని బాధితుడు వాపోయాడు.

శివయ్యపై భక్తితో..

జూపాడుబంగ్లా: కన్నడిగుల భక్తి అంచంచలమైనది. వారి భక్తిప్రవృత్తులకు దేవాదిదేవుడైన శివయ్య ప్రసన్నుడు కావాల్సిందే. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని కర్ణాటక రాష్ట్రంలోని బెల్గాం జిల్లా, చిక్కోడి తాలూకా, కబ్బూర్‌కు చెందిన గజానన్ నిర్వాణ్ అనే వ్యక్తి నాలుగు అడుగుల ఎత్తున్న చెక్కకాళ్లపై నిల్చొని నడుస్తూ శ్రీశైలం వెళ్తున్నాడు. సోమవారం జూపాడుబంగ్లాకు చేరుకున్నాడు. శ్రీశైలం మల్లన్న తాను అనుకొన్న కోర్కెలను తీర్చడంతో చెక్కకాళ్లపై నడుస్తూ శ్రీశైలం వెళ్తున్నట్లు తెలిపాడు.



చెక్కకాళ్లపై నడుస్తూ శ్రీశైలం వెళ్తున్న కన్నడ భక్తులు

సజావుగా పోలింగ్



ఓటు హక్కు వినియోగించుకునేందుకు క్యూలో నిల్చున్న నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి



ప్రభుత్వ బాలికల పాఠశాలలో పోలింగ్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్



ఓటు వేసినట్లు చూపుతున్న ఆళ్లగడ్డ ఎమ్మెల్యే బిజేంద్రారెడ్డి

- పట్టభద్రుల ఓటింగ్ 77.03 శాతం
- ఉపాధ్యాయుల ఓటింగ్ 94.01శాతం
- స్థానిక సంస్థల ఓటింగ్ 95.37 శాతం
- పోలింగ్ సరళిని పరిశీలించిన కలెక్టర్, జాయింట్ కలెక్టర్

నంద్యాల: పట్టభద్రులు, ఉపాధ్యాయులు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగిసింది. డోన్, పగిడ్యాల పోలింగ్ కేంద్రాల్లో 4 గంటల్లోపు కేంద్రాలకు చేరుకున్న వారికి సాయంత్రం 6 గంటల వరకు ఓటు వేసేందుకు అవకాశం కల్పించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటింగ్‌లో పాల్గొనడానికి పట్టభద్రులు, ఉపాధ్యాయులు, స్థానిక సంస్థల ప్రతినిధులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. జిల్లాలో 94 పోలింగ్ కేంద్రాల్లో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంతంగా ముగియడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఓటింగ్ వేయడానికి వచ్చిన వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీరు, షామియానాలు, వైద్య సిబ్బందిని అధికారులు అందుబాటులో ఉంచారు. జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్, జాయింట్ కలెక్టర్ నిశాంతిలు కలెక్టరేట్ నుంచి సీసీ కెమెరాల ద్వారా జరుగుతున్న పోలింగ్ సరళిని పరిశీలించారు. పట్టణంలోని పోలింగ్ కేంద్రాలకు వెళ్లి పోలింగ్ జరుగుతున్న విధానాన్ని పరిశీలించి పోలింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలీసులకు సూచనలు చేశారు. పట్టభద్రుల పోలింగ్ 77.03 శాతం, ఉపాధ్యాయుల ఓటింగ్ 94.01 శాతం, స్థానిక సంస్థల ఓటింగ్ 95.37 శాతం నమోదైంది. నంద్యాల డివిజన్‌కు సంబంధించిన పట్టభద్రులు, ఉపాధ్యాయుల బ్యాలెట్ బాక్స్‌లను పట్టణంలోని పీఎస్సీ కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని స్ట్రాంగ్ రూంలకు, ఆత్మకూరు డివిజన్ ఉపాధ్యాయ, పట్టభద్రుల బ్యాలెట్ బాక్స్‌లను ఆత్మకూరు ప్రభుత్వ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలకు, డోన్‌కు సంబంధించిన బ్యాలెట్ బాక్స్‌లను సుధా ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలకు తరలించారు.

మధ్యాహ్నం నుంచి ఊపందుకున్న పోలింగ్..

ఉదయం 8 గంటలకే స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటును వినియోగించుకున్నారు. జిల్లాలో 584 మంది ఓటర్లలో 247 మంది పురుషులు, 310 మంది మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం 4 గంటలకు స్థానిక సంస్థల పోలింగ్ ముగియగా 95.37 శాతం ఓటింగ్ నమోదైంది. ఇక పట్టభద్రుల కోసం ఏర్పాటు చేసిన 61 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం నెమ్మదిగా కొనసాగింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి భారీగా తరలివచ్చారు. సాయంత్రం 4 గంటలకు ముగియాల్సిన పట్టభద్రుల పోలింగ్ సాయంత్రం 6 గంటల వరకు కొనసాగింది. జిల్లాలో 54,929 మంది ఓటర్లలో 42,310 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోగా 77.03 శాతం పోలింగ్ నమోదైంది. జిల్లాలో 30 పోలింగ్ కేంద్రాల్లో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పోలింగ్‌కు ప్రభుత్వ, ప్రైవేటు, ఉపాధ్యాయులు భారీగా తరలి వచ్చారు. జిల్లాలో 4,426 మంది ఉపాధ్యాయ ఓటర్లలో 4,161 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 2,631 మంది, మహిళలు 1,530 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. జిల్లాలో ఉపాధ్యాయులు 94.01శాతం తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓటు వేసిన ఎమ్మెల్సీలు, ఎంపీ, ఎమ్మెల్యేలు

స్థానిక సంస్థల ఓటు హక్కును ప్రజాప్రతినిధులు వినియోగించుకున్నారు. నంద్యాల పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఎమ్మెల్సీలు ఇసాక్‌బాషా, గంగుల ప్రభాకర్‌రెడ్డి, ఫరూక్, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డిలు ఓటు వేశారు. ఆత్మకూరులో శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే ఆర్థర్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

- **గోస్పాడు:** మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 96 శాతం, గ్రాడ్యుయేట్స్ ఎన్నికలకు 80 శాతం పోలింగ్ నమోదైంది. 1,129 పట్టభద్రుల ఓట్లు ఉండగా 694 పురుషులు, 201 మహిళలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో 71 ఓట్లు ఉండగా 54 మంది పురుషులు, 14 మంది మహిళలు తమ ఓటును వేశారు. మొత్తం 68 ఓట్లతో 96 శాతం పోలింగ్ నమోదైంది.



క్యూలో నిల్చున్న మహిళలు

ఓటేసేందుకు ఆళ్లగడ్డ పట్టణంలో బారులు తీరిన పట్టభద్రులు



ఓటెత్తారు..



ఓటేసేందుకు వస్తున్న దివ్యాంగురాలు



పోలింగ్ సరళిని అధికారులతో ఆరా తీస్తున్న ఎస్పీ రఘువీర్‌రెడ్డి



ఓటు వేసేందుకు ట్రై సైకిల్‌పై వెళ్తున్న దివ్యాంగురాలు

- భారీగా ఓటు హక్కు వినియోగించుకున్న నియోజకవర్గ ఓటర్లు
- ఉపాధ్యాయులు 96.25 శాతం.. పట్టభద్రులు 76.65 శాతం పోలింగ్ నమోదు

ఆళ్లగడ్డ/ఉయ్యాలవాడ/రుద్రవరం/దొర్నిపాడు/శిరివెళ్ల: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికల పోలింగ్ నియోజకవర్గంలో ప్రశాంతంగా ముగిసింది. నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలోని మండల కేంద్రాల్లో ఏర్పాటు చేసిన 17 పోలింగ్ కేంద్రాల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం 8 గంటలకు మొదలైన పోలింగ్ సాయంత్రం 4 గంటలకు ముగియాల్సి ఉండగా కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు క్యూ లైన్లలో ఉండటంతో వారంతా ఓటు హక్కు వినియోగించుకునే వరకు అధికారులు పోలింగ్ నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా పట్టభద్రులు 7,505 ఉండగా 5,753 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోడంతో 76.65 శాతం పోలింగ్ నమోదైంది. ఉపాధ్యాయ ఎన్నికకు సంబంధించి 507 మంది ఓటర్లు ఉండగా అందులో 488 తమ ఓటు హక్కు వినియోగించుకోవడంతో 96.25 శాతం పోలింగ్ నమోదైంది. ఉపాధ్యాయ, పట్టభదుద్రల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి గతంలో ఎప్పుడూ జరగనంతగా భారీ స్థాయిలో పోలింగ్ శాతం నమోదు కావడంతో అధికారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మహిళలు, యువత పెద్దఎత్తున ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి, ఆళ్లగడ్డ డీఎస్పీ సుధాకర్‌రెడ్డిలు పర్యవేక్షించారు. ఎలాంటి చిన్న అవాంచనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలింగ్ ముగిసేవరకు కేంద్రాల్లో ప్రశాంతమైన వాతవరణం నెలకొనండంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.

- దొర్నిపాడులోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి తనిఖీ చేశారు.
- ఉయ్యాలవాడలో ఉదయం మందకొడిగా ప్రారంభమైన పోలింగ్ 10 గంటల నుంచి పుంజుకుంది. మధ్యాహ్నానికంతా ఓటర్లు బారులు తీరి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.
- రుద్రవరంలోని పోలింగ్ కేంద్రాన్ని ఆళ్లగడ్డ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి పరిశీలించారు. క్యూలైన్‌లో వేచి ఉన్న ఓటర్లు, పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

మండలాల వారీగా ఓటర్లు, పోలైన ఓట్లు

	పట్టభద్రులు			ఉపాధ్యాయులు		
మండలం	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం	మొత్తం ఓటర్లు	పోలైంది	పోలింగ్ శాతం
ఆళ్లగడ్డ	2692	2056	76.37	246	237	69.34
చాగలమర్రి	1491	1146	76.86	113	112	99.11
దొర్నిపాడు	530	456	86.03	19	18	94.73
రుద్రవరం	789	602	76.29	39	36	92.30
శిరివెళ్ల	1313	951	73.42	69	65	94.20
ఉయ్యాలవాడ	690	542	78.55	21	20	95.23
	7,505	5753	76.65	507	488	96.25



పట్ట భద్ర ఓటు వేసి వెళ్తున్న దివ్యాంగుడు



పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సుకు సీల్ వేస్తున్న అధికారులు



దొర్నిపాడులో ఓటు వేసేందుకు బారులు తీరిన పట్టభద్రులు



ఉయ్యాలవాడలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న ఆళ్లగడ్డ రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి



శిరివెళ్లలోని పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన పట్టభద్రులు



రుద్రవరంలో ఓటు వేసేందుకు బారులు తీరిన పట్టభద్రులు

డబ్బు అడిగినందుకు దారుణం

- మేనల్లుడి చేతిలో మామ హత్య

రుద్రవరం: స్థానిక బెస్త కాలనీకి చెందిన యంగమ్మ, తిరుపతి(35) అక్కా తమ్ముడు. వీరిద్దరికీ పెళ్లిళ్లు కావడంతో వేర్వేరుగా కాపురం ఉంటున్నారు. కొంత కాలం క్రితం తిరుపతి తన పొలాన్ని విక్రయించగా వచ్చిన డబ్బును సోదరి యంగమ్మ కుమారుడు మల్లేష్ తన వద్ద ఉంచుకున్నాడు. అడిగినప్పుడల్లా ఇప్పుడిస్తా అప్పుడిస్తూ అంటూ వాయిదా వేస్తూ వస్తున్నాడు. ఈక్రమంలో తిరుపతి కొత్తగా ఇంటి నిర్మాణం చేపట్టాడు. సామగ్రి కొనాల్సి ఉందని, తన డబ్బు తనకు ఇవ్వాలని అల్లుడిని కోరాడు. పదేపదే వాయిదా వేస్తే తన ఇంటి నిర్మాణం నిలిచిపోతుందని వేడుకున్నాడు. అయినా ఏ మాత్రం జాలి లేకుండా కర్రతో తలపై మోదాడు. అతడు తీవ్ర రక్తస్రావమై కుప్పకూలి అపస్మారక స్థితిలో పడి పోయాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు.



మృతి చెందిన తిరుపతి

తిరుపతికి భార్య మల్లేశ్వరి, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. కాగా పూర్తి వివరాలు సేకరించి కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. సొంత సోదరి కుమారుడే కదా అని నమ్మి డబ్బులిచ్చాడు. 'అవసం ఉంది నా డబ్బు నాకివ్వు' అని అడిగినప్పుడల్లా కాలయాపన చేస్తున్నా సర్దుకుపోతూ వచ్చాడు. ఇంటి నిర్మాణానికి అత్యవసరం కావడంతో కచ్చితంగా ఇవ్వాలని కోరాడు. అంతే.. మేనమామ అనే కనికరం కూడా లేకుండా అల్లుడే కర్రతో తలపై మోది హత్య చేశాడు. ఈ ఘటన మండల కేంద్రంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది.

చురుగ్గా అభివృద్ధి పనులు

పాములపాడు: మండలంలోని తుమ్మలూరు గ్రామంలో అభివృద్ధి పనులు చురుకుగా సాగుతున్నాయని సర్పంచు వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు రామలింగేశ్వరరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం మంజూరు చేసిన రూ.20 లక్షలతో డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టారు. సోమవారం ఆ పనులను పరిశీలించారు. జెడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి రామలింగేశ్వరరెడ్డి సహకారంతో పనులు వేగంగా చేపడుతున్నామని, గ్రామంలో మౌలిక సమస్యలు లేకుండా ఎప్పటి కప్పుడు చర్యలు చేపడుతున్నామని చెప్పారు.



డ్రైనేజీ కాలువను పరిశీలిస్తున్న సర్పంచు, వైఎస్సార్‌సీపీ నాయకులు